
ప్రజాశక్తి
శనివారం 16 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం



అడారుగెడ్డతో గిరిజనులకు తప్పని అవస్థలు


గెడ్డ దాటుకొని అవతల ఒడ్డుకు వెళ్తున్న గిరిజనులు

మక్కువ : మండలంలోని దుగ్గేరు సమీపాన ఆడారుగెడ్డ ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది. మక్కువ సాలూరు మండలాలకు సంబంధించి సుమారు 15 గ్రామాలకు దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదకరమైన, శిథిలమైన కాజువే ద్వారా ప్రయాణించేందుకు గిరిజనులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వంతెన నిర్మించాల్సిందిగా గిరిజనులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో సముచిత స్థానం

- 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి సంధ్యారాణి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- శకటాల ద్వారా ప్రభుత్వ ప్రగతి ప్రదర్శన
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు


జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్, ఎస్పి


జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం/టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలుపోలీసు రక్షక దళాలు చేసిన విన్యాసాలు, మార్చ్ ఫాస్టు, గౌరవ వందన తదితర అధికారిక ప్రక్రియల నడుమ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆద్యంతం ఉత్సాహ భరితంగా సాగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి జాతీయ జెండాను ఎగురవేశారు. సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు

అనంతరం ఆమె జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రసంగం ఆమె మాటల్లోనే..

'రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలను రెండుకళ్ళుగా భావిస్తోంది. పి4 కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని జిల్లాను ఆదర్శంగా నిలపాలి. జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుకు అన్ని చర్యలు చేపట్టాం. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం 'తల్లికివందనం" పథకం కింద జిల్లాలో లక్షా 15 వేల మంది తల్లుల ఖాతాల్లో రూ.172 కోట్లు జమ చేశాం. మూడేళ్లుగా రాష్ట్రంలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచాం. ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచాం. అదే స్ఫూర్తిని కొనసాగించి ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించాలి. షైనింగ్ స్టార్ వేడుకలను పార్వతీపురంలో ఏర్పాటు చేసుకుని 121 మంది విద్యార్థులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అవార్డులను అందజేశారు. గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి 373 పాఠశాలలకు రూ.45 కోట్లు విద్యా శాఖ మంత్రి మంజూరు చేశారు. గిరిజన యువతకు విశాఖపట్నంతో పాటు విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో స్టడీసర్కిళ్లను ఏర్పాటు చేసి ఉన్నత స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. జిల్లాలో వ్యాధుల నివారణకు డ్రోన్ల ద్వారా కూడా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాం. సాలూరు, భద్రగిరి, కురుపాం ఆసుపత్రుల్లో అదనపు వసతులు ఏర్పాటు శరవేగంగా సాగుతున్నాయి. సీతంపేట, పార్వతీపురం మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రుల పనులు శరవేగంగా పూర్తిచేస్తున్నాం. రక్తహీనత నివారణకు గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశాం. అన్నదాత సుఖీభవనం కింద జిల్లాలో లక్షా 22 వేల 260 మంది రైతులకు రూ.85 కోట్లు మొదటి విడతగా జమ చేశాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 వేల768 మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను మంజూరు చేశాం. జిల్లాలో పండిన జీడి పంటకు మరింత విలువ ఆధారిత కల్పించే ఉద్దేశ్యంతో జీడి ప్రాసెసింగు యూనిట్ పార్వతీపురంలో రూ.74 లక్షలతో నెలకొల్పాం.ఉద్యాన పంటలైన పసుపు, కొబ్బరి వంటి పంటలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం.

జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. ఈ ఏడాది తోటపల్లి, వెంగళరాయసాగర్, పెద్దగడ్డ జలాశయాల నుండి ఖరీఫ్ పంటకు సాగునీరు విడుదల చేశాం. గర్భిణీలలో పౌష్టికాహార లోపాన్ని నివారణకు ప్రత్యేకపౌష్టికాహారాన్ని అందించేందుకు రూ.19కోట్లతో ప్రతిపాదించాం. 516 అంగన్వాడీకేంద్రాలను 'సాక్షం' అంగన్వాడీకేంద్రాలుగా గుర్తించి రూ.2 కోట్ల 36లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లభించేలా పర్యాటక ప్రాజెక్టులను చేపట్టనున్నాం. రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో 10 విభాగాల్లో జిల్లా నుంచి విజేతలుగా నిలవడం మరిచిపోని అనుభూతి. అంకితభావంతో పనిచేస్తూ జిల్లా సంపూర్ణ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివద్ధి పనులు, సాధించిన ప్రగతి అంశాలను తెలుపుతూ సాగిన శకటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జిల్లా నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, స్వాతంత్ర్య పోరాట సమరయోధులు, న్యాయ వ్యవస్థ ప్రముఖులు, పోలీసు అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం, వివిధ సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవా కార్యకర్తలు, పాత్రికేయులు, విద్యార్థులు ఉత్సాహంగా భాగస్వామ్యమయ్యారు. వేడుకల్లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బి.విజయ చంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్, డిఆర్‌ఒ కె.హేమలత, అన్నిశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆద్యంతం అలరించాయి. తొలుత గుమ్మలక్ష్మీపురం కెజిబివి విద్యార్థులు దేశ్‌కే రంగీల, గీతానికి చేసిన నృత్యాలు, కొత్తవలస కెపిఎం హై స్కూల్ విద్యార్థులు దేశభక్తి సంగీతానికి చేసిన ప్రదర్శనలు అలరించాయి. సీతానగరం కెజిబివి విద్యార్థులు చూడ చక్కని తల్లి గీతానికి, సీతంపేట కెజిబివి విద్యార్థులు చేసిన థింసా నృత్యం అబ్బురపరచాయి. పార్వతీపురం టిఆర్‌ఎంఎం హై స్కూల్ విద్యార్థులు చేసిన ఎత్తర జెండా గీతానికి, గరుగుబిల్లి కెజిబివి విద్యార్థులు చేసిన పిరమిడ్ మరియు జయహో గీతానికి చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల అనంతరం విద్యార్థులను మంత్రి అభినందించారు. కాగా గరుగుబిల్లి కెజిబివి ప్రథమ, సీతానగరం కెజిబివికి ద్వితీయ స్థానం రాగా, కెపిఎం హై స్కూల్ తృతీయ, సీతంపేట కెజిబివికి కన్సోలేషన్ బహుమతులను అందుకున్నాయి.


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి


మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బిందు (జాగిలం)

ఆకట్టుకున్న ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, వ్యవసాయ శాఖ, డిఆర్‌డిఎ, విద్యా శాఖ, ఐటిడిఎ, స్త్రీ, శిశు సంక్షేమం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, అటవీ, పీ 4 మరియు అగ్నిమాపక, విపత్తుల నివారణ నిర్వహణ సంస్థలు ఉన్నాయి. కాగా ఐసిడిఎస్ ప్రథమ, విద్యా శాఖ ద్వితీయ, గ్రామీణ నీటి సరఫరా తృతీయ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కన్సోలేషన్ బహుమతులను కైవసం చేసుకున్నాయి.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, జిల్లా అధికారులకు, సిబ్బందికి మంత్రి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న 589 మంది అధికారులు, సిబ్బంది ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా డాగ్ షో

బిందు, లైకా, శాండీ పేరు గల పోలీసు జాగిలాలు (డాగ్స్) చేసిన ప్రదర్శన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగా బిందు జాగిలం మంత్రికి నోటితో పుష్పగుచ్ఛాన్ని అందజేసి, సెల్యూట్ చేయగా, శాండీ, లైకా చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

స్టాళ్ల సందర్శన.. అభివృద్ధి అంశాలపై కలెక్టర్ ఆరా

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ అభివృద్ధిని తెలియజేసేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, జిసిసి, డిఆర్‌డిఎ, బిసి కార్పొరేషన్, ఐసిడిఎస్, జిల్లా ఉద్యానవన, సూక్ష్మ బిందు సేద్య విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, ఎపిఇపిడిసిఎల్ తదితర శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేయగా ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయ వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.


గిరిజన సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కెజిబివి విద్యార్థులు


స్వాతంత్ర్య సమరయోధుల వేషాధారణలో విద్యార్థులు


ప్రథమ స్థానంలో నిలిచిన ఐసిడిఎస్ శకటం

హడ్డుబంగి హెచ్‌ఎంకు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి- సీతంపేట

మండలం లోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమం ఉన్నత పాఠశాల ఈఏడాది పదో తరగతిలో రాష్ట్రంలోనే స్టేట్ ఫస్ట్ రావడంతో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి ఉమావాణి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డును, పురష్కారాన్ని అందుకున్నారు అమరావతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. ఈ మేరకు ఆమెకు డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు అభినందించారు


సిఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపల్ ఉమావాణి

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అవమానం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వాతంత్ర్య దినోత్సవ రోజున బిసి మహిళా నాయకులు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరికి అవమానం జరిగింది. జెండా ఆవిష్కరణకు ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసరాజు ఆమెను పిలిచి అవమానించారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వచ్చే వరకు జెండా ఆవిష్కరణ చేయకుండా నిలిపివేసిన కమిషనర్.. చైర్ పర్సన్ గౌరీశ్వరి లేని సమయంలో ఎమ్మెల్యేతో ఆవిష్కరణ చేయించారు.

ఎమ్మెల్యేతో జెండా ఆవిష్కరణ

కమిషనర్ నిర్దేశించిన సమయానికి జెండా ఆవిష్కరణ చేయకుండా జాప్యం చేయడంతో చైర్‌పర్సన్ గంటన్నర పాటు నిరీక్షించి వెనుదిరిగారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జెండా ఆవిష్కరణ చేయాల్సి ఉంది. తనను పిలిచి అవమానించిన కమిషనర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చైర్ పర్సన్ గౌరీశ్వరి విలేకరులకు చెప్పారు.

మహిళల అభ్యున్నతికే 'స్త్రీశక్తి'

- మంత్రి సంధ్యారాణి
- మహిళల ఉచిత బస్సు పథకం ప్రారంభం

ప్రజాశక్తి-సాలూరురూరల్

మహిళల అభ్యున్నతి కోసమే స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారని రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఉచిత బస్సు పథకం మహిళల చదువు, ఉద్యోగం, స్వయం ఉపాధికి ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. స్త్రీ శక్తి (ఉచిత బస్సు ప్రయాణం) పథకాన్ని సాలూరు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి నుంచి మహిళలు రాష్ట్రంలో 5 రకాల బస్సుల్లో ఎక్కడ నుండి ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2.62కోట్ల మంది మహిళలు లబ్ధి పొందనున్నారని చెప్పారు. అనంతరం మంత్రి మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, మహిళలతో కలిసి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ మీదుగా ఎన్టీఆర్ సెంటర్, కోట వీధి, డబ్బి వీధి మీదుగా మామిడిపల్లి వరకు బస్‌లో ప్రయాణించారు. మామిడిపల్లి లో పెద్ద ఎత్తున మహిళలు మంత్రికి హారతులిచ్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వైదేహి, సీతమ్మ, రమాదేవి, డొంక అన్నపూర్ణ, డొంక కరుణ, రొంపల్లి రజిని. పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్,బుస తవుడు, తాడుతూరి తిరుపతిరావు, పట్టణ పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయితే ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అని ప్రకటించడంతో పలువురు మహిళలు ఉదయం నుంచే బస్సు ఎక్కడంతో కండక్టర్లు వారికి సాయంత్రం నుంచి అమలు అని చెప్పి కిందకు దించేశారు.దీంతో పలుచోట్ల మహిళలు ఇబ్బంది పడ్డారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

కురుపాం : ఉచిత బస్సు పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. కురుపాంలో ఆమె ఉచిత బస్సు పథకాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు కె వి కొండయ్య, ఎ. నరేష్, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు దత్తి లక్షణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారు. మహిళలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరు స్వప్నిల్ పవార్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పడాలి భూదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, తేజావతి, గంటా సంతోష్, ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రారంభించిన కలెక్టర్

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్సులో ఉచిత బస్సుపథకాన్ని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఆర్టీసీ బస్సులో మహిళలతో ప్రయాణం చేశారు.ఉచిత బస్సు పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి


మహిళలతో కలిసి ప్రయాణిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


ఉచిత బస్సు పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు, డిఎతో కూడిన జీతం నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించి ప్రమోషన్లు ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. బలిజిపేటలో గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎ)ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ శాఖ పరిధిలో రైతులకు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న విఆర్‌ఎలకు ఏడేళ్లుగా జీతాలు పెరగలేదన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పెరుగుతున్న ధరలతో కుటుంబాలను పోషించడం కష్టంగా ఉందన్నారు. కావున గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎ సంఘం మండల అధ్యక్షులు తోట బాబురావు, కార్యదర్శి సుదర్శన, శ్రీను, మరియమ్మ, నక్షత్రమ్మ, సింహాచలం, జ్యోతి, విఆర్‌ఎలు పాల్గొన్నారు.


విఆర్‌ఎలను ఉద్దేశించి మాట్లాడుతున్న మన్మధరావు

స్వాతంత్ర్యం సాక్షిగా రాజ్యాంగాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్.

79వ స్వాతంత్రం దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి ఎదురుగా శివ పార్వతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఎగరవేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కనీసం ఒక్క ప్రాణ త్యాగం కూడా చేయని బిజెపి అధికారంలో ఉందని, బిజెపి, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రకటిస్తున్నాయని, అదే శక్తులు ఈరోజు జాతీయ జెండాని ఎగరవేయడం అంటే రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను మరల బానిసలుగా మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కావున స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రజలంతా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల్ని వెనక్కు నెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బంకురు సూరిబాబు, శ్రీ శివ పార్వతి ఆటో యూనియన్ నాయకులు నారాయణరావు, శంకర్రావు, మల్లేశు ఇతర డ్రైవర్లు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న సిఐటియు నాయకులు

ఉత్తమ సేవలకు ప్రశంసలు





స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులు రాష్ట్ర గిరిజనసంక్షేమ, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి ఉన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో (కుడి నుంచి ఎడమ వరుసు) : ఎస్ఎస్ శోభిక (జాయింట్ కలెక్టర), కె.హేమలత (డిఆర్), ఎం.సుధారాణి (డిఆర్‌డిఎ పీడీ) , కె.రామచంద్రరావు (డ్వామా పీడీ), ఎస్.భాస్కరరావు (డిఎంహెచ్ఒ), జి.నాగభూషణరావు (డిసిహెచ్ఎస్), కె.కనకదుర్గ (ఐసిడిఎస్ పీడీ), ఎల్.రమేష్ (డిపిఆర్ఒ), కె.రాబర్ట్‌పాల్ (జిల్లా వ్యవసాయాధికారి), టి.జగన్మోహనరావు (డిఇఒ), వై.నాగేశ్వరరావు (జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి)తో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు , సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని సూరంపేట, రామవరం పంచాయతీ కార్యదర్శులు ఎ.శిశుభూషణరావు, పి.మురళీకష్ణకు 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో చేపట్టిన సేవలకు గానూ ప్రశంసా పత్రాలు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. వీరిని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నాయకులు పి తిరుపతిరావు బి మనోహర్, ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ తదితరులు అభినందించారు.

సాలూరు రూరల్ : గిరిజన ప్రాంతంలో ఉత్తమ వైద్య సేవలకు గాను ప్రశంసా పత్రాన్ని తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అక్యాన అజయ్‌కుమార్ మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా అందుకుంటుకున్నారు. అలాగే ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె.రమేష్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అయనకు సిఐటియు, మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం తరపున ఎన్ వై నాయుడు, షేక్ షబానా చొక్కాపు సుశీల అభినందనలు తెలిపారు.

పాలకొండ : ఉమ్మడి జిల్లాల ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ దుబ రాంబాబుకు ఉత్తమ అధికారిగా అవార్డు అందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి సంధ్యారాణి జిల్లా కలెక్టర్ ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులు రావడం వల్ల మరింత బాధ్యతలు పెంచుతాయన్నారు.

వీరఘట్టం: ఉత్తమ సేవలు అందించిన అధికారులకు మంత్రి జి.సంధ్యారాణి, కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో జి.ప్రసాదరావు, సర్వేయర్ వి.బాలు ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ బి.వరలక్ష్మి, విఆర్ఒ దుర్గారావు, ఎంఎల్ హెచ పి భాగ్యరాధ ఉన్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారికి తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, వైద్యాధికారి బి. ప్రదీప్ కుమార్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : ఉత్తమ తహశీల్దార్‌గా నిమ్మక శేఖర్ మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే భద్రగిరి మలేరియా కార్యాలయంలో ఎంటిఎస్ గా విధులు నిర్వహిస్తున్న జి. కేశవరావు, తాడికొండ పిహెచ్‌సి హెల్త్ అసిస్టెంట్ బమ్మిడి లక్ష్మణరావు, జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు పైడా కొండలరావు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



గిరిజనులకు దుప్పట్లు, చీరలు అందజేస్తున్న నీడ్ డైరెక్టర్ వేణుగోపాల్

గర్భిణులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు రూరల్

నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాలూరు వైటిసి భవనంలో 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గర్భిణీలకు దుప్పట్లు, చీరలు, నీడ్ డైరెక్టర్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

గృహ నిర్మాణానికి హోలీ క్రాస్ చేయూత

ప్రజాశక్తి-భామిని

గృహ నిర్మాణ పనులకు హెూలీ క్రాస్ స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారాలు అందిస్తూ నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు మంజూరు చేసిన గృహాలకు పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టేందుకు స్లేవిప్ సహకారంతో ఎంపిక కాబడిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. బత్తిలికి చెందిన ఏనుగుల విజయ, కుప్ప లక్ష్మీ నిర్ణీత సమయానికి నిర్మాణాలు పూర్తి చేయడంతో గురువారం సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ నిరుపేద ఒంటరి మహిళలకు సకాలంలో సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వ సహాయంతో పాటు సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.



కళావేదికను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పాఠశాలలో కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కళావేదికను శుక్రవారం నిర్వహకులు ప్రారంభించారు. అంబటి అప్పలస్వామి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగ వెంకట సత్యనారాయణ ఆర్థిక సహకారంతో అతితక్కువ సమయంలో ఈ కళావేదికను ప్రారంభించారు.

పోలమాంబ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - మక్కువ

ఇలవేల్పు, ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దైవం పోలమాంబ అమ్మవారి ఆలయం నందు శ్రావణ శుక్రవారం సామూహిక ఉచిత కుంకుమ పూజలు ప్రముఖ ఋత్విక్యులు చాడ ముకేష్ కుమార్ చే ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయం ప్రత్యేక పుష్పాలంకరణ, పచ్చని తోరణాలతో ఆలయం అంతా అలంకరించారు. అనంతరం అనంతరం సామూహిక సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ బి.శ్రీనివాస్, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, ఎన్ తిరుపతిరావు, పూడి దాలినాయుడు. నైదాన సూర్య యాదవ్, గంజి కాశి నాయుడు, ఆలయ ఆసాధిలు, పాల్గొన్నారు.

సంజీవ రక్ష సేవలు అమోఘం

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ ప్రాంతంలో ప్రజలకు సంజీవ రక్ష ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అమోఘమని గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆ సంస్థ చైర్మన్ ధూబ పద్మావతికి అవార్డు అందించారు. ఆ సంస్థ మరిన్ని సేవలందించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 2023 నుంచి 25 వరకు అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. విద్యార్థినిలకు సుమారు 10వలే శానిటేషన్ ప్యాడ్లు పంపిణీ చేశామన్నారు.

వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు

79వ స్వాతంత్ర్య దినోత్సవ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వాడవాడలా భారత త్రివర్ణ పతాకం శుక్రవారం రెపరెపలాడింది. పలు ప్రభుత్వ కార్యాయాల వద్ద, విద్యా సంస్థల్లోనూ, పోలీసు స్టేషన్ల వద్ద జాతీయ పతాకాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ వారి త్యాగఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



కురుపాంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక కలెక్టరేట్, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోనూ, ఐటిడిఎ వద్ద జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎగరవేశారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. అన అనంతరం జాతీయ పతాకానికి వందన సమర్పణ చేసిన విద్యార్థులకు, సిబ్బందకి మిఠాయిలు పంచి పెట్టి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి, పలు విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్వతీపురం మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర జాతీయ జెండాలను ఆవిష్కరించారు, అనంతరం ఆయా కార్యాలయాల ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో

స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బి సి ఐ రంగనాథం,సిసిఎస్ సిఐ ఎం.అప్పారావు, సోషల్ మీడియా,సైబర్ సెల్ సిఐ శ్రీనివాస రావు , డిసిఆర్బి సిఐ సుధాకర్, ఏఆర్ ఆర్ఐ లు నాయుడు,రాంబాబు, శ్రీనివాస రావు ఎస్ఐలు ,ఆర్ఎస్ఐలు మరియు జిల్లా అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు..

వైసిపి కార్యాలయంలో...

స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే అలజంగి జోగారావు జాతీయ పతాక ఆవిష్కరించారు. కార్యక్రమంలో మూడు మండలాలు, మున్సిపాల్టీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటిడిఎ ఆధ్వర్యాన

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యేతో పాటు సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు అనంతరం విద్యార్థులు ప్రదర్శించి సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. సీతంపేట పోలీస్ షన్లో ఎస్సై వై.అమ్మనరావు, దోనుబాయి పోలీస్ స్టేషన్లో ఎస్సై షేక్ మస్తాన్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డీఈవో రామ్మోహన్‌రావు, ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, ఎంపిడిఒ కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో...

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెం డాను ఎగుర వేశారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎగురవేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్

కార్యక్రమంలో ఏఎంసి చైర్ పర్సన్ కద్రక కళావతి, మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, తహసీల్దార్ ఎన్ శేఖర్, ఆర్ఐ బి శివ, సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ రావు, విశ్రాంతి వైద్యులు జి.ప్రభాకర్‌రావు, హరిప్రసాద్, కూటమి నాయ కులు కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది, వర్తక సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. టి.శ్రీవరం, పలు పాఠశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ సచివాయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

కురుపాం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి జాతీయ జెండాను ఎగురవేశారు. గాంధీనగర్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలనేసి నివాళు లర్పించి, అనంతరం స్థానిక ఎఎంసి మార్కెట్ యార్డ్‌లోనూ జెండను ఆవిష్కరించారు. స్థానిక కోర్టులో న్యాయమూర్తి జె.సౌమ్యా జోస్పిన్,మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ శెట్టి పద్మావతి, ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయం డిఇఇ వద్ద కె. నాగేశ్వరరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ ఎం.కుమార్ స్వామి, పలు పాఠశాలల్లో, కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, కాపు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు శేఖర్ పాత్రుడు, మధుసూదన్‌రావు, న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, కేతిరెడ్డి అశోక్ కుమార్, రాంప్రసాద్, స్వామి, లోక్ అదాలత్ సభ్యుడు గొరారి వెంకటరావు, పారా లీగల్ వాలంటీరు ఎ. కోటేశ్వరరావు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లు, కోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాలయా ల్లోనూ, ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ సంస్థలో స్వాతంత్ర్య దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాల యం వద్ద తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి డి.రవ ఐమ్మ జాతీయ పతా కాన్ని ఆవిష్క రించారు. పం చాయతీ కార్యాల యం వద్ద సర్పంచి జె.తెరే జమ్మ, సీతా నగరం, పెద్ద అంకలాం పిహెచ్‌సి ల్లో ఆయా గ్రామ సర్పం చులు జాతీయ జెండా లను ఆవిష్కరిం చారు. కార్యక్రమం లో ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, వైద్యాధి కారులు రమ్య సాయి, పి.ఉషా రాణి, ఎంఇఒ జి.సూర్య దేముడు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక సబ్ డివిజన్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టరు స్వప్నిల్ పవార్ జెండా ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బొమ్మల భాను, నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల కుమారి, పోలీస్ స్టేషన్లో సిఐ ఎం చంద్రమౌళి, కోర్టులో జడ్జి హరిప్రియ, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రాధాకష్ణమూర్తి జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు, ఎంపిడిఒ రంగారావు టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, కె.అప్పల నాయుడు జాడశ్రీధర్ వెలమల తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో...

సిఐటియు ఆధ్వర్యంలో స్తానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ మతసామరస్యాలతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కె.రాము శేఖర్, కె.శ్రీనివాసు, జె.శ్రీనివాసు, డి.దుర్గారావు, వి.రవి, ఎన్.రాంబాబు తదితరులు ఉన్నారు.

పాచిపెంట : స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు, స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ డి.రవి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి బి.ప్రమీల జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో. ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, పల్లేడ ఉమామహేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు

కొమరాడ స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో జాతీయ జెండా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎగురవేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కూడా విద్యార్థులకు క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ రమేష్, తహసిల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆయా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, పాఠశాలల్లో, మండల పరిషత్, రెవెన్యూ, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద జాతీయ జెండాను ఎగరవేసి దాన్ని ప్రాధాన్యతను వివరించారు.



సీతంపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

కార్యక్రమంలో తహశీల్దారు బాలమురళీకృష్ణ, ఎంపిపి నాగమణి, జెడ్‌పిటిసి రవి సాయిరాం, ఎఎస్ఐ రమణ, వైద్యాధికారిణి శివ గాయత్రి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వీరఘట్టం : స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, విద్యా వనరుల కేంద్రంలో ఎండిఇఒలు డి.గౌరు నాయుడు, ఆనందరావు, పోలీస్ స్టేషన్లో ఎస్సై జి కళాధర్, ఐకెపి వద్ద ఎపిఎం కె.రాము, ట్రాన్స్కో కార్యాలయంలో కె.అనిల్ కుమార్, పిహెచ్‌సిల వద్ద వైద్యాధికారు బి.ప్రదీప్ కుమార్, ఎ. మానస, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సిహెచ్ సుధాకర్ రెడ్డి, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డిజివిఎస్ త్రినాధ, శ్రీ గాయత్రి పాఠశాల, కళాశాలలో కరస్పాండెంట్ ఎస్ లోకేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), కెజిబివిలో లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, జాతీయ జెండాను ఎగరవేశారు.

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ కె.భరత్‌కుమార్, పోలీసు స్టేషన్‌లో సీఆర్పీ ఎఫ్ కమాండెంట్, స్థానిక ఎస్సై వెంకటరమణ జెండాను ఎగరవేసి వందన సమర్పణ చేశారు. ఎంఇఒ శ్యాంసుందర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద జండా వందనక సమర్పణలు పాల్గొన్నారు.

భామిని: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే జయకృష్ణ ఆవిష్కరించారు. తొలుత ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించి, పూలతో నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, రెవెన్యూ సిబ్బంది, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, నాయకులు ఉన్నారు.

సాలూరు రూరల్ : మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం పట్ల ప్రతి ఒక్కరికీ భక్తి, విశ్వాసం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వులు ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, నాయకులు గిరి రఘు మద్దిల గోవింద, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే. మండలంలోని మామిడిపల్లి బాగువలస, శివరాంపురం, తోనామ్, కురుకుట్టి, కందుల పదం, మావుడి, అన్నమరాజు వలస, కరాసువలస, కొత్తవలస, నెలిపర్తి, జిగిరం, పారన్నవలస, పెద్దబోరబంధ గ్రామాల్లో పాఠశాలల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ నిర్వహించారు.

ప్రజల సొమ్మును లూటీ చేస్తున్న వారిపై పోరాడాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

నాడు బ్రిటీష్ వారు, నేడు బహుళ జాతి సంస్థలు దేశాన్ని లూటీ చేస్తూనే ఉన్నాయని, వీటిపై పోరాటమే ప్రజల కర్తవ్యం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్యామలాంబ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణ సభల్లో అయన మాట్లాడారు. దేశ స్వాతంత్రం కోసం ఆనాడు ప్రజలంతా కుల, మత, ప్రాంతాలను పక్కన పెట్టి బ్రిటీష్ వాడితో పోరాడి విజయం సాధించారని, వాటి ఫలితంగానే అనేక ప్రభుత్వ రంగ సంస్థలు నెలకొల్పబడ్డాయన్నారు. నేడు బహుళ జాతి సంస్థలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయన్నారు. వీటిపై భవిష్యత్తులో పోరాటాలకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంపోలు సంతు, వసంత, రమేష్, ఈశ్వర రావు ,సోమేశ్ కార్మికులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో

మండలంలోని మామిడిపల్లిలో ముంగారమ్మ తల్లి ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరజాపు జ్యోతిష్ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు జాతీయ జెండా ఆవిష్కరించారు.



సభలో మాట్లాడుతున్న ఎన్‌వై నాయుడు

అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు రవాణా రంగంలో పనిచేస్తున్న లక్షలాది కుటుంబాల ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా ఉచిత బస్సులు నడపాలని ప్రభుత్వం చూస్తుందని, వెంటనే వాహన మిత్ర పథకం అమలు చేయాలని, లేకుంటే భవిష్యత్తులో స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధపడతామని, దీనికి రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముంగరమ్మ తల్లి ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.జ్యోతిష్, నాయకులు అప్పలరాజు, నర్సింగ్, సత్యనారాయణ, మహేష్, రమేష్, కమిటీ సభ్యులు అంగన్వాడీ, ఆశాలు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

ప్రజాశక్తి వీరఘట్టం



రోడ్డుపై ప్రవహిస్తున్న చెత్తాచెదారం

మండలంలోని శుక్రవారం వర్షం కురిసింది. మూడు రోజులుగా ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో ఒక్కసారిగా ఆకాశంలో నల్లటి మబ్బులు ఏర్పడి ఉరుములు, మెరుపులు లేకుండా వర్షం కురవడంతో వీధిలో ఉన్న మురికి కాలువలు నీటితో నిండుకున్నాయి. ఎద జల్లిన పొలాలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ జంక్షన్ నుండి ఇరిగేషన్ కార్యాలయం వరకు రహదారికి ఇరువైపుల ఉన్న కాలువల్లో నీరు చేరడంతో రోడ్డుపై చెత్త ,చెదరాలు ప్రవహించడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

కురుపాం : క్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో కురుపాంకు చెందిన గెంబలి శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుంచి 12 మద్యం సీసాలు సీజ్ చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జె.రాజశేఖర్ సిహెచ్ .చంద్ర కాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఎల్‌విఆర్' నగదు బహుమతి

ప్రజాశక్తి - సీతానగరం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తున్న ఎల్‌విఆర్ ప్రతినిధులు

79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ప్రముఖ ఎల్‌విఆర్ సేవా సంస్థ అధినేత, పెదబోగిలి మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ కంకణపల్లి అరవింద్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి గాను పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.2,000, రూ.1000, రూ.500బహుమతులను అందజేశారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాల్లో భాగంగా స్కూల్ బెంచ్‌ల కోసం ఎల్‌విఆర్ సేవా సంస్థ ద్వారా రూ.10వేలు విరాళం పాఠశాలకు అందజేశారు. ఈ సంస్థ స్ఫూర్తితో సీతానగరం వాసవి క్లబ్ రూ.10వేలు, వక్కలగెడ్డ సంగమేశ్వర రావు కుమారుడు సురేష్ రూ.5000/-, గేదెల వెంకట మురళీకృష్ణ రూ.10వేలు, ఇజ్జాడ రాంబాబు రూ.5వేలు విరాళం గా ఇచ్చారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

ప్రజాశక్తి కొమరాడ

ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ గురై ఇంటి పెద్ద మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక తెలిపిన వివరాలిలాన్నాయి. మండలంలోని విక్రాంపురానికి చెందిన ఉబ్బిశెట్టి చిట్టిబాబు(60) తన ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మీటర్ వద్ద మరమ్మతు పనులు చేస్తుండగా షాక్‌కు గురై అక్కడిక్కడే చెందాడు. ఇతను భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంలో కుటుంబ సభ్యులను కన్నీరు మున్నీరయ్యారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిట్టిబాబు మృతితో గ్రామంలో విషాద ఛాయల అమలుకున్నాయి.

కాలువలో మృతదేహం లభ్యం

వీరఘట్టం: మండలంలోని కడ కెల్లలో తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ మొదటి కాలువలో గురువారం అర్ధరాత్రి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై జి.కళాధర్ శుక్రవారం తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలువలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తీసి పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. సాలూరు మండలానికి చెందిన కొత్తకోట రామకృష్ణ (53) తల్లి ఈనెల 8న మృతి చెందడంతో మరణ ధ్రువ పత్రం తీసుకువస్తానని, ఈనెల 11న ఇంటి నుండి బయటకు వచ్చి ఎప్పటికీ చేరకపోవడంతో భార్య సంతోష్ భయపడి సాలూరులో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈనెల 12న సర్దార్ గౌతు లచ్చన్న ప్రాజెక్టు వద్ద రామకృష్ణ బట్టలు ఉన్నట్లు గుర్తించిన తమ్ముడు రమేష్ అక్కకు సమాచారమిచ్చాడు. ప్రధాన కాలువలో మృతదేహం ఉండవచ్చునని అనుమానంతో ఈనెల 14న పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. గురువారం రాత్రి మృతదేహం లభ్యం కావడంతో ఆమెకు సమాచారం ఇచ్చి మృతదేహం అప్పగించినట్లు తెలిపారు.